సాక్షి నల్లగొండ

శుక్రవారం ; 26 ; సెప్టెంబర్ ; 2025



కొలువుల ఆనందం

టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో పలువురు అభ్యర్థులు ఉన్నత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. - 10లో



చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

బంగారు ఆభరణాల చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సూర్యాపేట ఎస్పీ నరసింహ తెలిపారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :		590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	586.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,93,744 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,73,169 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,130 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,019 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు





అలరించిన బతుకమ్మ వేడుకలు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో గురువారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు హాజరైన జనం



చిడతలు పట్టి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

న్యూస్‌రీల్

సన్న బియ్యం పంపిణీకి ప్రత్యేక సంచులు

నల్లగొండ: రేషన్ కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సన్నబియ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంచులను అందుబాటులోకి తీసుకొచ్చింది. నల్లగొండ జిల్లాకు 4.65 లక్షల సంచులు కేటటాయించి మండల స్థాయి గోదాములకు పంపించింది. ఈ సంచులను జిల్లాలోని రేషన్ కార్డుదారులకు అక్టోబర్ 1 నుంచి రేషన్‌తోపాటు అందజేయనున్నారు. రేషన్ కార్డుపై అందరికీ సన్న బియ్యం-ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం అనే నినాదంతో ఈ సంచులను ప్రభుత్వం తయారు చేయించింది.

సీసీ కెమెరాలతోనే భద్రత




సీసీ కెమెరాల మానిటర్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

గుర్రంపోడు : సీసీ కెమెరాలతోనే ప్రజలకు భద్రత పక్కాగా ఉంటుందని, ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. గురువారం గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో దాతలు, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాల వల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. అంతకుముందు ఎస్పీ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట దేవరకొండ ఏఎస్పీ పి.మౌనిక, సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ పసుపులేటి మధు తదితరులు ఉన్నారు.

30 వరకు చేయూత పింఛన్ల పంపిణీ

నల్లగొండ: జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీ గురువారం ప్రారంభమైందని, ఈ నెల 30 తేదీ వరకు లబ్ధిదారులకు అందజేస్తామని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత, కల్లు గీత, ఒంటరి మహిళలకు వారి పరిధిలోని పోస్టాఫీసుల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.16 చిల్లరతో సహా పింఛన్ మొత్తం అడిగి తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామకృష్ణ



నల్లగొండ టౌన్ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన మేడే రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొంపెల్లి భిక్షపతి, అధ్యక్షుడు యానం విజయ్‌కుమార్‌తోపాటు రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంచనాల్లో ఆశావహులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపై ఆశలు

- బీసీ రిజర్వేషన్ల పెంపుతో బరిలో నిలిచేందుకు పెరుగుతున్న ఆశావహులు
- గ్రామాలు, మండలాల్లో ఏయే స్థానాలు వస్తాయన్న లెక్కలపై ఆరా
- స్థానాలు తగ్గిపోతుండడంతో నిరాశలో జనరల్ అభ్యర్థులు
- అవకాశాల కోసం ముఖ్యనేతలు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆశావహుల్లో అంచనాలు మొదలయ్యాయి. బీసీలకు ఈసారి రిజర్వేషన్ల పెంపుతో బీసీ నేతల్లో ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఎక్కడ తమకు అవకాశం దక్కనుందన్న అంచనాల్లో పడ్డారు. మరోవైపు బీసీలకు రిజర్వేషన్ల పెంపుతో జనరల్‌లో స్థానాలు తగ్గిపోనున్న నేపథ్యంలో ఇప్పటివరకు ఉన్న స్థానాల్లో ఎవరి స్థానాలు గల్లంతు అవుతాయో, ఎవరివి ఉంటాయోనని జనరల్ అభ్యర్థులు ఆందోళనలో పడ్డారు.

ఏర్పాట్లలో యంత్రాంగం

స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. గతంలోనే బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసింది. మరోవైపు బ్యాలెట్ పేపర్లకు సంబంధించిన ప్రక్రియను చేపట్టింది. వార్డుల వారీగా అటు గ్రామ పంచాయతీల ఎన్నికలతోపాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి ఇటీవలే ప్రకటించింది. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక జీవోను జారీ చేసి, ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్న ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారు చేయాలని చెప్పడంతో ఆ ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం పూర్తిచేసింది.

రిజర్వు కానున్న అధిక స్థానాలు

గతంలో జనరల్ స్థానాలు అధికంగా ఉండగా ఈసారి బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెరగడంతో బీసీలకు ఎక్కువ స్థానాలు రిజర్వు కానున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆశావహులంతా తమ మండలాలు, గ్రామాల్లో ఏయే స్థానాలు దక్కే అవకాశాలు ఉన్నాయనే దానిపై అంచనాలు వేసుకుంటున్నారు. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ స్థానాలు ఎక్కడెక్కడ వచ్చే అవకాశం ఉంది.. జనరల్ స్థానాలు ఎక్కడ వస్తాయి.. గతంలో వచ్చిన రిజర్వేషన్లు రొటేషన్‌లో ఎక్కడెక్కడ మారిపోనున్నాయన్న వివరాలను సేకరించే పనిలో పడ్డారు. వాటి ప్రకారం తమకు ఏ స్థానంలో పోటీకి అవకాశం దక్కుతుందనే దానిపై లెక్కలు వేసుకుంటున్నారు.

బీసీల్లో పెరుగుతున్న ఆశావహులు

బీసీలకు ఈసారి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుండడంతో బీసీ ఆశావహుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ఆశావహులంతా ఈసారి పెద్ద ఎత్తున పోటీకి సిద్ధమవుతున్నారు. నల్లగొండ జిల్లాలో 353 ఎంపీటీసీ స్థానాలు ఉంటే అందులో 148 స్థానాలు, 33 జెడ్పీటీసీ స్థానాల్లో 14 స్థానాలు ప్రత్యేకంగా బీసీలకే రిజర్వు కానున్నాయి. సూర్యాపేట జిల్లాలో 235 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అందులో 99 స్థానాలు బీసీలకే దక్కనున్నాయి. 23 జెడ్పీటీసీ స్థానాల్లో 10 స్థానాలు బీసీలకు లభించనున్నాయి. అదే స్థాయిలో మండల పరిషత్ అధ్యక్షుల (ఎంపీపీ) స్థానాలు దక్కనున్నారు. వీటితోపాటు బీసీలకు పెద్ద ఎత్తున సర్పంచ్ స్థానాలు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో అవి ఎక్కడెక్కడ వస్తాయి.. తాము ఎక్కడ పోటీ చేయవచ్చనే అంశాలపై పోటీ చేసేందుకు సిద్ధమైన బీసీ ఆశావహులు అప్పుడే అంచనాలు వేసుకుంటున్నారు.

నిరాశలో జనరల్ అభ్యర్థులు

ప్రభుత్వం ఈసారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనుండడంతో జనరల్ స్థానాలు భారీగా తగ్గిపోతున్నాయి. జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలతో పాటు సర్పంచ్ స్థానాల్లోనూ జనరల్ స్థానాలు తగ్గిపోనున్నాయి. దీంతో జనరల్ అభ్యర్థుల్లో నిరుత్సాహం నెలకొంది. తాము పోటీ చేయాలనుకున్న స్థానాలు జనరల్‌కు వస్తాయా లేకపోతే రిజర్వేషన్‌లో బీసీలకు వెళతాయా అన్న సందిగ్ధంలో ఉన్నారు. ఎవరికి వారు.. ఎక్కడ ఏ రిజర్వేషన్లు వస్తాయనే దానిపై జనరల్ ఆశావహులంతా లెక్కలపై ఆరా తీస్తున్నారు. అవకాశం కోసం అప్పుడే ముఖ్య నేతలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరగడం మొదలు పెట్టారు.

మద్యం టెండర్లకు నోటిఫికేషన్

- రెండేళ్ల కాల పరిమితికి విడుదల చేసిన ప్రభుత్వం
- నేటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబర్ 23 డ్రా పద్ధతిన దుకాణాల కేటాయింపు
- ఎస్సీ, ఎస్టీ, గౌడలకు రిజర్వేషన్ ప్రకటించిన కలెక్టర్
- ఈ సారి టెండర్ ఫీజు రూ.3లక్షలు
- డిసెంబర్ 1న ప్రారంభించనున్న కొత్త వైన్స్



రిజర్వేషన్ కేటాయింపునకు డ్రా తీస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: రెండేళ్ల పాటు కొత్త మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో జిల్లా కలెక్టర్ మద్యం షాపులను కేటాయించనున్నారు. జిల్లాలో 154 మద్యం దుకాణాలు ఉండగా నూతన మద్యం పాలసీ ప్రకారం రిజర్వేషన్ పద్ధతిన ఎస్సీలకు 14, ఎస్టీలకు 4, గౌడలకు 34 షాపులను కేటాయించారు. ఇందుకుగాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు సమక్షంలో గురువారం కలెక్టరేట్‌లో డ్రా తీశారు. ఎవరికి ఏయే షాపులు అనేది శుక్రవారం ప్రకటించనున్నారు.

నేటి నుంచి దరఖాస్తులు

నూతన మద్యం దుకాణాలకు ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలను జిల్లా కలెక్టర్ కేటాయించనున్నారు.

రెండేళ్ల పాటు దుకాణాలకు లైసెన్స్

కొత్త మద్యం దుకాణాలకు రెండేళ్ల పాటు లైసెన్స్‌లు ఇవ్వనున్నారు. డ్రాలో దుకాణాలు దక్కించుకున్న వారంతా డిసెంబర్ 1 నుంచి వాటిని తెరవాల్సి ఉంటుంది. అప్పటి నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు లైసెన్స్ కాల పరిమితి గడువు ఉండనుంది.

ఈ సారి పెరిగిన టెండర్ ఫీజు

టెండర్‌లో పాల్గొనేవారు రూ.3 లక్షలు టెండర్ దరఖాస్తు కింద చెల్లించాల్సి ఉంటుంది. గతంలో రూ.2 లక్షలు ఉన్న దరఖాస్తు రుసుమును ప్రభుత్వం రూ.3 లక్షలకు పెంచింది. ఎన్ని దుకాణాలకు టెండర్లు వేస్తే ఒక్కోదానికి రూ.3 లక్షల చొప్పున డీడీ చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుల స్వీకరణకు మూడు చోట్ల కౌంటర్లు

కొత్త మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ మూడు చోట్ల ఉండనుంది. నల్లగొండలోని రామగిరిలో గల ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం, ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో, హైదరాబాద్ నాంపల్లిలోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

ఒక్కరు ఎన్ని దుకాణాలకైనా టెండర్లు వేయవచ్చు



కొత్త మద్యం దుకాణాల కోసం ఒక్కొక్కరు ఎన్నింటికైనా టెండర్లు వేసుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. డ్రాలో ఒక్కరికే ఎన్ని దుకాణాలు వెళ్లినా కేటాయించబడతాయి. నల్లగొండలో 2 చోట్ల, హైదరాబాద్‌లో నాంపల్లి కమిషనర్ కార్యాలయంలో టెండర్ల స్వీకరణ ఉంటుంది. హైదరాబాద్‌లో ఉండేవారు అక్కడే టెండర్ దాఖలు చేయవచ్చు.

–బి.సంతోష్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

జల సంరక్షణలో జాతీయ అవార్డు



కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జల సంరక్షణ- ప్రజల భాగస్వామ్యం (జల్ సంచయ్ జన్ భాగీదారీ) పథకాన్ని పక్కాగా అమలు పర్చినందుకు నల్లగొండ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డు ప్రకటించింది. మన జిల్లాతోపాటు తెలంగాణలోని ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు జాతీయ అవార్డు దక్కింది. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి పోటీపడిన జిల్లాల్లో తొలి మూడు స్థానాలను తెలంగాణ జిల్లాలే దక్కించుకోగా ఇందులో నల్లగొండ ఉండడం విశేషం. ఈ పురస్కారం కింద రూ.2 కోట్ల నగదు ప్రోత్సాహకం లభించనుంది. నీటి సంరక్షణ కోసం జిల్లాలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో కేంద్రం నిధులతో చెక్ డ్యాములు, పాంపాండ్స్, ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్స్, గుట్టలపై కందకాలు, పార్కులేషన్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టినందుకు ఈ అవార్డు దక్కింది. జాతీయ అవార్డు సాధించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆయా జిల్లాల అధికారులు, ప్రజలను అభినందించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ జిల్లాకు ఇలాంటి అవార్డు రావడం మొదటిసారి అని, ఈ ఘనత ఉపాధి హామీ సిబ్బందికే దక్కుతుందని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది, ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటు చోర్‌పై నేటి నుంచి సంతకాల సేకరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ: బీజేపీ ఓటు చోర్‌పై జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు చోర్‌పై ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎన్నికల కమిషన్ మాత్రం కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ అక్కడ ఓటు చోర్‌కి పాల్పడుతుందని పేర్కొన్నారు. బీజేపీ ఓటు చోర్‌పై అన్ని గ్రామాలు, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో సంతకాలు, అభిప్రాయ సేకరణ చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఐదు రోజులుగా ధర్నా చేస్తున్నా పట్టించుకోరా..

- మెడికల్ కళాశాల ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన
- నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని వేడుకోలు



మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

నల్లగొండ టౌన్ : ఏజెన్సీ నిర్వాహకులు తమకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని నల్లగొండ మెడికల్ కళాశాలలో శానిటేషన్, సెక్యూరిటీ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నుంచి విధులను బహిష్కరించి మెడికల్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్నారు. వీరు చేపట్టిన ధర్నా గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు నారబోయిన ప్రశాంత్, రాజు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలలో తాము విధులు నిర్వహిస్తున్నామని, అయినా నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. జీతాలే కాకుండా ఆరు నెలలుగా ఏజెన్సీ నిర్వాహకులు తమకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపులు చేయడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి దసరాకు తమ నాలుగు నెలల వేతనాలను ఇప్పించాలని వేడుకుంటున్నారు. కార్యక్రమంలో మధుమురళి, అండాలు, చంద్రమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

భూభారతి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: రెవెన్యూ సదస్సులు, భూభారతిలో వచ్చిన అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 4న రెవెన్యూ శాఖ మంత్రి జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం ఉన్నందున రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం అసైన్డ్, వక్ఫ్, ఎండోమెంట్స్ భూములు తదితర అంశాలపై ఆమె సమీక్షించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేలవాలుతున్న వరిచేలు

- అధిక వర్షంతో వాలిపోతున్న పొలాలు
- నాన్‌ఆయకట్టులో కోత దశకు వచ్చిన చేలు
- పొలంలోనే వర్షం నీటిలో తడుస్తున్న గింజలు
- గింజలు మొలకెత్తే ప్రమాదముందని రైతుల్లో ఆందోళన



నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలో నేలవాలిన వరిచేను

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలో ఇటీవల కురుస్తున్న అధిక వర్షాల కారణంగా వేలాది ఎకరాలలో వరిచేలు నేలవాలుతున్నాయి. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5,05160 ఎకరాల్లో వరిసాగైనట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన దేవరకొండ, నల్లగొండ, చండూరు, మునుగోడు వ్యవసాయ డివిజన్లలో జూన్, జూలై మాసాల్లో వరినాట్లు వేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే వరిచేలు గింజలు ఎర్రబారి కోత దశకు వచ్చాయి. ఈ తరుణంలో పదిహేను రోజులుగా వరుసగా వర్షాలు కురవడంతో వేలాది ఎకరాల్లో వరిచేలు పూర్తిగా అడ్డంపడి నేలవావాలినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

వరికోత మిషన్లు వెళ్లేందుకు వీలుకాక..

చేలు నేలవారి వర్షం నీటిలో తడుస్తుండడంతో వరి గింజలు మొలకెత్తే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. వరికోతలు కోయాలంటే నీరు నిలిచి ఉండడంతో పొలాల్లోకి మిషన్లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. నేలవాలిన వరిని కోయాలంటే చైన్ మిషన్ ద్వారా కోయించాల్సి ఉంటుంది. చైన్ మిషన్‌తో కోయించాలంటే గంటకు రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందని దీంతో తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వడ్లు మొలకెత్తుతాయని భయంగా ఉంది



ఎర్రబారిన వరిచేను వర్షాల కారణంగా పూర్తిగా అడ్డంపడిపోయింది. పొలంలో నీరు నిలిచిన కారణంగా వరిగింజలు మొలకెత్తుతాయని భయంగా ఉంది. కోయాలన్నా మిషన్ పొలంలోకి వెళ్లే పరిస్థితి లేదు.

– జానపాటి రాజేంద్రప్రసాద్, రైతు గుండ్లపల్లి, నల్లగొండ మండలం

యూరియా కష్టాలు తీర్చాలని రాస్తారోకో



అడవిదేవులపల్లి : రాస్తారోకో చేస్తున్న రైతులు



త్రిపురారం : రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం బారులుదీరిన రైతులు

అడవిదేవులపల్లి : యూరియా కష్టాలు తొలగించాలని కోరుతూ గురువారం అడవిదేవులపల్లిలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు స్థానిక మిర్యాలగూడ ప్రధాన రోడ్డుపై చెట్టు కొమ్మలు అడ్డంగా వేసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా యూరియా కోసం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు వస్తున్నా అందరికీ దొరకడం లేదని వాపోయారు. ఇప్పటికైనా మండల రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

టోకెన్ల కోసం తెల్లవారుజామునుంచే బారులు

త్రిపురారం : రైతులను యూరియా కష్టాలు వీడడం లేదు. వరిపైరుకు యూరియా వేసే అదును దాటిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం త్రిపురారం పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు టోకెన్ల కోసం స్థానిక రైతు వేదిక వద్ద ఉదయం 4 గంటల నుంచే క్యూకట్టారు. రైతులు పెద్ద ఎత్తున రావడంతో పోలీసుల సమక్షంలో టోకెన్లు పంపిణీ చేశారు. అనంతరం యూరియా పంపిణీ చేయగా అందని చాలా మంది రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

నా ఆరేళ్ల కష్టం..


దొంతిరెడ్డి రోహితారెడ్డి

చిలుకూరు: చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి రోహితారెడ్డి గ్రూప్–1 తుది ఫలితాల్లో డీఎస్పీ పోస్టుకు ఎంపికైంది. ఆమె తండ్రి దొంతిరెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌గా పనిచేస్తున్నారు. రోహితారెడ్డి వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్‌ఐటీ)లో బీటెక్ పూర్తిచేసింది. బీటెక్ ఫైనలియర్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వచ్చినప్పటికీ.. 2019 నుంచి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతూ గ్రూప్–1 రాసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు.

తండా నుంచి ఆర్డీఓగా..


తెజావత్ అశోక్‌నాయక్

మిర్యాలగూడ: దామరచర్ల మండలం పార్థునాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బతండాకు చెందిన తెజావత్ అశోక్‌నాయక్ గ్రూప్–1 ఫలితాల్లో ఆర్డీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అశోక్‌నాయక్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసి.. సివిల్స్ లక్ష్యంగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. గ్రూప్–1 రాసి ఆర్డీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు అన్నివర్గాల ప్రజలకు అందేలా చూస్తానని అశోక్‌నాయక్ తెలిపారు.

డిప్యూటీ జైలర్‌గా..


ఆవుల సతీష్

సూర్యాపేట: ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన ఆవుల సతీష్ గ్రూప్–1 తుది ఫలితాల్లో సబ్ జైలర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సతీష్ తండ్రి ఆవుల వెంకన్న ఫైర్ ఏడీఎఫ్‌ఓగా పనిచేస్తున్నారు. తమిళనాడులోని వెల్లూరు వీఐటీలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన సతీష్ ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ గ్రూప్–1 పరీక్ష రాసి సబ్ జైలర్‌గా ఉద్యోగం సాధించారు. సతీష్‌ను గ్రామస్తులు అభినందించారు.

డిగ్రీ పూర్తికాగానే గ్రూప్–1 ఉద్యోగం


జువేరియా

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ కాలనీకి చెందిన చిరువ్యాపారి ఎండీ మౌజంఅలీ, అమీనాబీ దంపతుల రెండో కుమార్తె జువేరియా గ్రూప్–1 తుది ఫలితాల్లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైంది. చిన్నప్పటి చదువులో ముందుండే జువేరియా కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కళాశాలలో 2023లో డిగ్రీ(బీఎస్సీ మ్యాథ్స్) పూర్తిచేసి గోల్డ్ మెడల్ అందుకుంది. 2024లో గ్రూప్–1 నోటిఫికేషన్ పడగానే దరఖాస్తు చేసుకొని సొంతంగా ప్రిపేర్ అయ్యి మొదటి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ ఉద్యోగం సాధించింది. జువేరియా అక్క సుమయ్య పర్వీన్ కూడా డీఎస్సీ సాధించి ప్రస్తుతం కోదాడ ఉర్దూ మీడియం పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తోంది.

కలెక్టర్ కావడమే లక్ష్యం

గ్రూప్–1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించడం ఎంతో సంతృప్తినిచ్చింది. డిగ్రీ పూర్తయ్యే వరకు గ్రూప్స్ రాస్తానని అనుకోలేదు. డిగ్రీ పూర్తికాగానే నోటిఫికేషన్ రాగానే దరఖాస్తు చేసుకున్నా. ఆ వెంటనే దానికి అవసరమైన మెటీరియల్‌ను యూట్యూబ్, నెట్ ద్వారా సేకరించుకున్నాను. ఆయా మెటీరియల్స్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించుకుని రోజుకు 12 నుంచి 14 గంటలు చదివాను. భవిష్యత్తులో సివిల్స్ రాసి కలెక్టర్ కావడమే నా లక్ష్యం. నా విజయం వెనుక నా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. – జువేరియా

జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎంపీడీఓగా..


కత్తి శివశంకర్‌రెడ్డి

పెద్దవూర: : గ్రూప్–1 ఫలితాల్లో మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కత్తి శివశంకర్‌రెడ్డి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. శివశంకర్‌రెడ్డి స్వస్థలం పెద్దవూర మండలం బట్టుగూడెం గ్రామం. శివశంకర్‌రెడ్డి చిన్నతనంలోనే అతడి తండ్రి రాంచంద్రారెడ్డి మృతిచెందారు. దీంతో తల్లి పద్మ వ్యవసాయం చేస్తూ శివశంకర్‌రెడ్డితో పాటు అతడి చెల్లిని చదివించింది. బీటెక్ పూర్తిచేసిన శివశంకర్‌రెడ్డి ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే గ్రూప్–4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. జూనియర్ అసిస్టెంట్‌గా తన బాధ్యతలను నిర్వహిస్తూనే గ్రూప్–1 పరీక్షలకు పట్టుదలతో సన్నద్ధమై అనుకున్న ఎంపీడీఓ ఉద్యోగాన్ని సాధించారు. అతడు రెండు పర్యాయాలు సివిల్స్ మెయిన్స్‌కు కూడా అర్హత సాధించారు. తన కుమారుడికి గ్రూప్–1 ఉద్యోగం రావడంతో అతడి తల్లి సంతోషం వ్యక్తం చేస్తోంది.

కష్టానికి ఫలితం.. కొలువుల ఆనందం

వారందరూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో అహర్నిషలు కష్టపడి చదివారు. క్రమశిక్షణతో చదువుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతూ టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 తుది ఫలితాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులపై ప్రత్యేక కథనాలు..

మున్సిపల్ కమిషనర్‌గా ఎంపికైన శ్రీజారెడ్డి


తల్లిదండ్రులతో నర్రా శ్రీజారెడ్డి

నల్లగొండ: గ్రూప్–1 తుది ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన నర్రా శేఖర్‌రెడ్డి, కరుణ దంపతుల కుమార్తె నర్రా శ్రీజారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించింది. ఇప్పటికే ఆమె గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికై సంగారెడ్డి మెడికల్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది. అంతేకాకుండా గ్రూప్–3 ఫలితాల్లో కూడా 111వ ర్యాంకు సాధించింది. గ్రూప్–2 ఫలితాలు వెలువడాల్సి ఉంది. శ్రీజారెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి ఎస్‌జీటీ టీచర్‌గా నార్కట్‌పల్లి మండలం ఏనుగులదొరి గ్రామంలో పనిచేస్తున్నారు. వారి స్వస్థలం చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామం. శ్రీజారెడ్డి డిగ్రీ పూర్తిచేసి ఇంట్లోనే ఉండి సొంతంగా పోటీ పరీక్షలకు సిద్ధమైంది. శ్రీజారెడ్డి గ్రూప్–1 ఉద్యోగం సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు శేఖర్‌రెడ్డి, కరుణ ఆనందం వ్యక్తం చేశారు. మొదట నుంచి శ్రీజారెడ్డి చదువులో చురుకుగా ఉండేదని, ఆమె ఇష్టం ప్రకారమే డిగ్రీ చదివించామని వారు పేర్కొన్నారు.

అమ్మానాన్న ప్రోత్సాహంతోనే సాధ్యమైంది

చదువు విషయంలో మా అమ్మానాన్న ఎప్పుడు నాపై ఒత్తిడి చేయలేదు. నువ్వు ఎన్ని సంవత్సరాలు చదివినా.. చదివిస్తామని చెప్పి నన్ను ప్రోత్సహించారు. 2020లో డిగ్రీ పూర్తయినప్పటి నుంచి ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. సివిల్స్‌కు కూడా రాశాను. ఆ అనుభవమే గ్రూప్–1 మెయిన్స్‌కు ఉపయోగపడింది. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించాను. – శ్రీజారెడ్డి

గెలుపు.. 'రుచి'త చూసింది


రుచితకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్లబోయిన రుచిత గ్రూప్–1 తుది ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగం సాధించింది. మిర్యాలగూడ మండలం మొలకల పట్నం గ్రామానికి చెందిన ఎల్లబోయిన రవి, శోభ దంపతులు 30 ఏళ్ల క్రితం కొండమల్లేపల్లి పట్టణ కేంద్రానికి వలస వచ్చి వెటర్నరీ మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. వారి ఏకైక కుమార్తె రుచిత హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తిచేసి ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంది. ఈ క్రమంలో గ్రూప్–1 రాసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది. కలెక్టర్ కావాలనే రుచిత కోరికను తాము ఎంతో ప్రోత్సహించామని, నిత్యం 14 గంటల పాటు చదివిన కష్టానికి మంచి ఫలితం దక్కిందని ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కుమార్తెకు స్వీట్స్ తినిపించి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

అనాథ నుంచి డీఎస్పీ స్థాయికి..


ముడుసు శ్రీకాంత్

గుర్రంపోడు: చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయినా కష్టపడి గ్రూప్–1లో డీఎస్పీ ఉద్యోగం సాధించారు గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ముడుసు శ్రీకాంత్. అతడి తల్లిదండ్రులు భిక్షమయ్య, చెన్నమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో శ్రీకాంత్‌ను, అతడి తమ్ముడు కృష్ణకాంత్‌కు కొండమల్లేపల్లిలోని సోలిడార్ తెలంగాణ అనే స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదివించడమే గాక గ్రూప్స్ కోసం శిక్షణ ఇప్పించింది. శ్రీకాంత్ ట్యూషన్లు చెప్పుకుంటూ నిజాం కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. 2014లో రైల్వేలో టెక్నికల్ ఆఫీసర్‌గా, 2018లో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు వచ్చినప్పటికీ కలెక్టర్ కావాలని ఆ ఉద్యోగాల్లో చేరకుండా గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఉద్యోగంలో చేరి పట్టుదలతో చదివి గ్రూప్–1లో రాష్ట్రస్థాయిలో ఎస్సీ కేటగిరిలో ఆరో సాధించి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

తల్లిదండ్రుల బాటలో..


సందీప్‌కు స్వీట్ తినిపిస్తున్న తండ్రి వెంకటాద్రి

తిరుమలగిరి(తుంగతుర్తి): గ్రూప్–1 ఫలితాల్లో తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు పత్తి వెంకటాద్రి కుమారుడు పత్తి సందీప్‌కుమార్ డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సందీప్‌కుమార్ 2020లో ఇంజనీరింగ్ పూర్తిచేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలోనే గ్రూప్–1 రాసి మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికయ్యారు. సందీప్ తండ్రి వెంకటాద్రి అడ్డగూడూరులో గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా.. తల్లి లలిత వైద్యారోగ్య శాఖలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

సొంత ప్రిపరేషన్‌తో..


పోటు సంకీర్త్

కోదాడ: గ్రూప్–1 తుది ఫలితాల్లో మోతె మండలం అన్నారిగూడెం గ్రామానికి చెందిన పోటు ఉపేందర్‌రావు, సత్యావతి దంపతుల కుమారుడు సంకీర్త్ ఎంపీడీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంతేకాకుండా గ్రూప్–2లో 642వ ర్యాంకు సాధించగా.. గ్రూప్–4 రాసి రెవెన్యూ విభాగంలో ఉద్యోగం సాధించారు. సివిల్స్ 2025 మెయిన్స్ పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఎంపీడీఓ ఉద్యోగం సాధించినందుకు చాలా ఆనందంగా ఉందని సంకీర్త్ పేర్కొన్నారు. సొంతంగా నోట్స్ తయారు చేసుకుని, స్టాండర్డ్ బుక్స్ చదివి తాను ఉద్యోగం పొందినట్లు తెలిపారు. ఉద్యోగ సాధనలో తన తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేదనిదన్నారు.

సివిల్స్‌కు సన్నద్ధమవుతూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక


దాడి వెంకటరమణ

నల్లగొండ: నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణ గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. వెంకటరమణ తండ్రి దాడి శ్రీనివాసరావు ఈఈడబ్ల్యూఐడీసీలో ఏఈగా పనిచేస్తుండగా.. తల్లి రమాదేవి ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వెంకటరమణ వరంగల్‌లో ఎన్ఐటీలో ఇంజనీరింగ్, ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తిచేశారు. ప్రస్తుతం బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆరేళ్లుగా సివిల్స్‌కి ప్రిపేరవుతూ గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అంతకుముందు ఆయన సివిక్స్ జూనియర్ లెక్చరర్‌గా, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు కూడా ఎంపికయ్యారు. గ్రూప్–2లో 378 ర్యాంకు సాధించారు.

ఐఏఎస్ కోసం సన్నద్ధమయ్యా..

నేను యూపీఎస్సీ ద్వారా ఐఏఎస్‌కు ఎంపిక కావాలని ప్రిపేర్ అయ్యా. 6 సంవత్సరాలుగా 4 సార్లు పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. గ్రూప్–1 పరీక్ష రాసి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై ఆ కోరికను తీర్చుకున్నా. చాలా సంతోషంగా ఉంది. మా అమ్మానాన్నలు ఎంతో ఆనందపడుతున్నారు. – దాడి వెంకటరమణ

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ–కొండ్రపోల్ మధ్య రైలు పట్టాలపై బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లడంతో రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు కోలముఖంతో 6.5 అడుగుల ఎత్తు ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. తెలుపు రంగు షర్టు, జీన్స్ ప్యాంట్ ధరించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రైల్వే ఎస్ఐ బొడిగె రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు మృతి

శాలిగౌరారం: మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన శాలిగౌరారం మండలం వల్లాల గ్రామ పంచాయతీ పరిధిలోని జోలంవారిగూడెంలో గురువారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జోలంవారిగూడేనికి చెందిన జోలం మల్లమ్మ(65) ఇటీవల హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లి గురువారం తిరిగి స్వగ్రామానికి వస్తోంది. ఈ క్రమంలో వల్లాల గ్రామానికి చెందిన ఓ మహిళ స్కూటీపై జోలంవారిగూడేనికి వస్తుండగా.. గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా మట్టి లోడుతో వస్తున్న ట్రాక్టర్ వద్ద స్కూటీ అదుపుతప్పడంతో మల్లమ్మ ట్రాక్టర్ కింద పడింది. ఈ ప్రమాదంలో మల్లమ్మ పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని శాలిగౌరారం ఎస్ఐ సైదులు తెలిపారు.

అక్టోబర్ 9 నుంచి లతీఫ్ ఉల్లాఖాద్రి ఉర్సు


ఉర్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో హజరత్ సయ్యద్‌షా లతీఫ్ ఉల్లాఖాద్రి ఉర్సు అక్టోబర్ 9 నుంచి ప్రారంభంకానున్నట్లు ఉర్సు కమిటీ నిర్వాహకులు తెలిపారు. గురువారం నల్లగొండలో జరిగిన ఉర్సు కమిటీ, ముతవలీల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఉర్సు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఉర్సు కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 9న గంధం ఊరేగింపు, 10న దీపాలంకరణ, 11న ప్రముఖ ఖవ్వాలి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ అశోక్, మాజీ కౌన్సిలర్లు నవీన్‌గౌడ్, ఇబ్రహీం, ఇంతియాజ్, మసి, ముతవల్లీలు సయ్యద్ సమీయుల్లా ఖాద్రి, సయ్యద్‌గౌస్ ఉల్లా ఖాద్రి, సయ్యద్ ఉబేద్‌ఖాద్రి, సల్మాన్‌ఖాద్రి, అవైయిస్ ఖాద్రి, తబరేస్ ఖాద్రి, రయ్యాన్ ఖాద్రి, ఉర్సు కమిటీ వైస్ ప్రెసిడెంట్లు హాశం, ఠాగూర్, ఇంతియాజ్ హుస్సేన్, సమద్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ ఢీకొని బాలిక మృతి


రోడ్డు ప్రమాదానికి గురైన కారు


అద్వితీరియా (ఫైల్)

కట్టంగూర్, నకిరేకల్ : ఆగి ఉన్న కారును సిమెంట్ లారీ ఢీకొనడంతో బాలిక మృతిచెందింది. ఈ ఘటన కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన కందుల రుతు ఝాన్సీ తన కుమార్తె లవీణతో పాటు ఇద్దరు మనుమరాళ్లు రెముడాల అద్వితీరియా(14), ఎండీ ఆలీనతో కలిసి స్వగ్రామం నుంచి కారులో హైదరాబాద్‌లో ఉంటున్న తన కుమారుడి వద్దకు గురువారం ఉదయం బయల్దేరారు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామ శివారులోని గచ్చుగురు చెరువు వద్దకు రాగానే కారు వెనుక టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ విజయవాడ–హైదరాబాద్ హైవే పక్కన ఆపాడు. కారులో ఉన్న వారందరూ కిందికి దిగి హైవే పక్కకు నిలబడగా.. అద్వితీరియా కారు ముందు భాగంలో నిలబడింది. డ్రైవర్ ఏర్పుల సామేల్ టైరు మార్చుతున్న క్రమంలో కోదాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంట్ లారీ అతివేగంగా వచ్చి కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందుకు దూసుకపోవటంతో క్యాబిన్ ముందు ఉన్న అద్వితీరియాను తలకు తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా ఆలీనకు స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరిని 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అద్వితీరియా మృతి చెందింది. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తాత కందుల లాజరస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ లారీని అక్కడే నిలిపి పారిపోయాడు.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

సూర్యాపేట: ఒకే రోజు పలు ఇళ్లలో చోరీకి పాల్పడిన దొంగపై కేసు నమోదు చేసి గురువారం రిమా ండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. డీఎస్పీ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన గంపల శ్యామ్ ఈ నెల 22న చివ్వెంల మండలంలోని కొండలరాయినిగూడెం గ్రామానికి చెందిన వల్లపురాణి, కొంపల్లి జయమ్మ, అల్లి మల్లిక ఇళ్లలో చోరీకి పాల్పడి, బంగారం, వెండి వస్తువులు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గురువారం బీబీగూడెం గ్రామ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గంపల శ్యామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. తాను చోరీ చేసినట్లు నిజం ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి బైక్, నల్లపూసల గొలుసు 14.5 గ్రాములు, జుంకాలు 1.23 గ్రాములు, మూడు జతల పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి

సూర్యాపేట: వ్యవసాయ బావి వద్ద విద్యుత్ వైర్లను చెక్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మెకానిక్ మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని దాచారం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాచారం గ్రామానికి చెందిన విద్యుత్ మెకానిక్ బుడిగబోయిన హనుమయ్య(58) గురువారం అదే గ్రామానికి చెందిన పులుగుజ్జు మల్లయ్య అనే రైతు వ్యవసాయ బోరు వద్ద ఉన్న విద్యుత్ వైరుకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో సరిచేసేందుకు వెళ్లాడు. విద్యుత్ వైర్లు పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై హనుమయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని అతడి బంధువులు మృతదేహాన్ని రైతు పులుగుజ్జు మల్లయ్య ఇంటి ముందు ఉంచి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా రైతు మల్లయ్యను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సౌమ్య

నల్లగొండ : కనగల్ మండల పరిధిలోని జి.యడవల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్సనబోయిన సౌమ్య హైదరాబాద్ నిజాం కాలేజీలో శుక్రవారం నుంచి జరగనున్న జాతీయ హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సౌమ్యను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

యాదగిరిగుట్టలో అష్టోత్తర శతఘటాభిషేకం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని గురువారం ఉదయం ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, పంచామృతాలు, శుద్ధ జలాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపిన బంగారు, వెండి కలశాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలకారమూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. ఇక స్వాతి నక్షత్రం పురస్కరించుకొని భక్తులు, ఆలయ ఉద్యోగులు, అర్చకులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 5గంటలకు కొండ కింద గల వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొని, స్వామివారి పాదాల వద్ద, వైకుంఠ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.


ఆలయ ముఖ మండపంలో బంగారు, వెండి కలశాల్లో పంచామృతాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సాగర్‌కు తగ్గుముఖం పట్టిన వరద


26 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

- ఎగువ నుంచి 2,93,744 క్యూసెక్కుల వరద
- 26 గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: సాగర్‌కు ఎగువ నుంచి వస్తున్న వరద కొంత మేర తగ్గింది. గత రెండు రోజులు 3లక్షల క్యూసెక్కులకు పైగా వరద రాగా.. గురువారం 2,93,744 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,28,330 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,130, కుడి కాల్వ, ఏఎమ్మార్పీ వరద కాల్వల ద్వారా 11,719 క్యూసెక్కులు కలిపి 2,73,169 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590(312 టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 586.70(303 టీఎంసీలు) అడుగుల మేర నీటి మట్టం ఉంది.

ఎడమ కాల్వకు నీటి నిలిపివేత

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాల్వకు అధికారులు గురువారం నీటి విడుదలను నిలిపివేశారు. ఉదయం నుంచే నీటిని తగ్గిస్తూ.. మధ్యాహ్నం 2గంటలకు పూర్తిగా నీటిని నిలిపివేశారు.

బంగారు ఆభరణాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- 18 తులాల బంగారు ఆభరణాలు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్: బంగారు ఆభరణాల దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట ఎస్పీ కె. నరసింహ తెలిపారు. నిందితుల నుంచి 18 తులాల బంగారం ఆభరణాలు, ఒక కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసు వివరాలను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలానికి చెందిన పులిచింతల అరుంధతి 2024 ఆగస్టు 18న సూర్యాపేట జిల్లా మోతె మండలం విభలాపురం గ్రామంలో తన బంధువుల పెళ్లికి బయల్దేరింది. తన బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌తో సూర్యాపేట బస్టాండ్‌లో ఖమ్మం డిపోకు చెందిన బస్సు ఎక్కి మోతెకు వెళ్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మోతె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం సాయంత్రం మోతె మండలం మామిళ్లగూడెం టోల్‌ప్లాజా వద్ద మునగాల సీఐ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి కారులో వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపారు. వారి వద్ద 18 తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన వారు ఏపీలోని కర్నూలు జిల్లా బుద్రాపేట్ గ్రామానికి చెందిన గారడి జ్యోతి(ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం), హైదరాబాద్‌లోని బడంగ్‌పేటకు చెందిన మహమ్మద్ షేక్ సమీర్‌గా పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. పులిచింతల అరుంధతి హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను బస్సులో దొంగలించినట్లు వారు ఒప్పుకున్నారు. నిందితురాలు గారడి జ్యోతిపై హైదరాబాద్ పరిసర ప్రాంతాల పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు దొంగతనం కేసులు ఉన్నందున.. బంగారు ఆభరణాలు అక్కడ అమ్మితే అనుమానం వచ్చి అరెస్ట్ చేస్తారని.. వాటిని దాచి బుధవారం ఆంధ్రా ప్రాంతంలో అమ్మేందుకు కారులో వెళ్తుండగా పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. వీరిద్దరికి సహకరించిన దుర్గ అనే మహిళ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

నల్లగొండ: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి. దుర్గాప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కోదాటి శ్రీను, మిర్యాలగూడ మండలం బాదలాపురం గ్రామానికి చెందిన వాణి పెద్దమనుషుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సతానం. శ్రీను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్ల పాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఆ తర్వాత వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో వాణిని శ్రీను కొట్టడంతో ఆమె తన పుట్టింటికి వెళ్లింది. పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టి నచ్చజెప్పడంతో ఆమె కాపురానికి వచ్చింది. 2024 డిసెంబర్ 3వ తేదీన ఇంట్లో వాణి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వాణి తల్లితండ్రులు అల్లుడు శ్రీను, అతడి తల్లితండ్రులు, అన్న వదినలపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ప్రశాంత్ కేసు నమోదు చేయగా.. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి విచారణ జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. జవహర్‌లాల్ కోదాటి శ్రీను తన భార్య వాణిని హత్య చేసినట్లు ఆధారాలు కోర్టుకు సమర్పించాడు. ఆయన వాదనలతో ఏకీభవించిన నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి డి. దుర్గా ప్రసాద్ శ్రీనుకు జీవిత ఖైదుతో పాటు మరో 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా, శ్రీను తల్లితండ్రులు కోదాటి రాములు, కన్నమ్మ, అన్న, వదినలు నాగరాజు, మౌనికకు 2 సంవత్సరాల 6 నెలల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. లైజన్ ఆఫీసర్ పి. నరేందర్, ఎన్. మల్లికార్జున్, కోర్టు కానిస్టేబుల్ డి. కిరణ్‌కుమార్ సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సహకరించారు.